క్లుప్తంగా

విద్యుత్ భవన్ ఎదుట ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరంలోని విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసి, వాచ్‌మెన్‌లకు స్కిల్డ్‌వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, డిస్కం అధ్యక్షుడు శంకర్, నాయబ్ రసూల్, సుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

కడప సెవెన్‌రోడ్స్ : గత 14 రోజులుగా సమ్మె చేస్తున్నా తమ డిమాండ్ల విషయంపై ప్రభుత్వం స్పందించలేదని పేర్కొంటూ మున్సిపల్ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, ఎర్రగుంట్ల, బద్వేలు, కడప నుంచి కార్మికులు తరలివచ్చారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు కూడా ఇవ్వకపోవడం విచారకరమని మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్ర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, కోశాధికారి గోపి, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేశు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కడప అర్బన్: రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్.కె నగర్ కట్టమీద గంగమ్మ గుడి సమీపంలో సోమవారం జూదమాడుతున్న నలుగురిని ఎస్ఐ నారాయణ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారిలో మలినేని శ్రీనివాసులు, జయపాల్, భాస్కర్, ఆంజనేయులు ఉన్నారు. వారి వద్ద నుంచి రూ. 9,650 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

మట్కా బీటర్లు అరెస్ట్

కడప అర్బన్: కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎర్రముక్కపల్లిలో మట్కా ఆడుతున్న ఇద్దరు నిందితులను సీఐ సి. భాస్కర్‌రెడ్డి తమ సిబ్బందితో అరెస్ట్ చేశారు. వారిలో గుంతబజార్‌కు చెందిన మహబూబ్‌బాషా, అశోక్‌నగర్‌కు చెందిన చాంద్‌బాషా వున్నారు. వీరి వద్ద నుంచి రూ.9300 నగదును, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

అనాథలకు అంత్యక్రియలు

కడప అర్బన్: మేము సైతం సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం రెండు మృతదేహాలకు అంత్యక్రియలను నిర్వహించారు. బద్వేల్ పట్టణంలో నైట్ షెల్టర్ నిర్వాహకుడు రవి తమ దగ్గరున్న ఓ అనాథ మహిళ అనారోగ్యంతో బాధపడుతుండగా రిమ్స్‌లో చేర్పించారు. ఆమె సోమవారం మృతి చెందింది. అలాగే చింతకొమ్మదిన్నె మండలం పరిధిలో బుగ్గవంక డ్యామ్ వద్ద ప్రమాదవశాత్తు మరణించిన ఓ యువకుడికి నా అన్నవారు ఎవరూ లేకపోవడంతో పోలీసుల సిఫారసు మేరకు అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మేము సైతం సేవాసంస్థ ప్రతినిధులు వంకధారి రాము, 11వ బెటాలియన్ హెడ్‌కానిస్టేబుల్ అయ్యవారయ్య, రామరాజు, శివరాం, గురువయ్య, భానుప్రకాష్, నైట్ షెల్టర్ నిర్వాహకుడు రవి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ఉద్యోగులందరికి ప్రభుత్వం సత్వరమే హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని వైఎస్సార్‌జిల్లా సమగ్రశిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ విషయమై వారంతా సోమవారం సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ప్రతినిధులు అరవింద్, మహేష్, లక్ష్మణ్, భాస్కర్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

అట్లూరు : మండల పరిధిలోని కొండూరు పోలీసుస్టేషన్ సమీపాన కడప – బద్వేలు ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోవిళ్ళ నారాయణరెడ్డికి గాయాలు అయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కొత్తకోటపాడు గ్రామానికి చెందిన చెందిన నారాయణరెడ్డి వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు వైపు దూరంగా నిలిచి ఉన్నాడు. సిద్దవటం వైపు నుంచి బద్వేలు వైపు ఓ గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా వచ్చి ఆయనను ఢీకొనడంతో గాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు 108 లో కడపకు తరలించారు. ద్విచక్ర వాహనదారుడు అక్కడ నుంచి ఉడాయించాడు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ..

అట్లూరు మండల పరిధిలోని ముత్తుకూరుకు చెందిన మద్దూరు రామయ్య గాయపడ్డాడు. రామయ్య తన అత్తగారి గ్రామమైన చెన్నూరు మండలం రామనపల్లెకు వెళుతుండగా లంకమల అభయారణ్యం షరాబుదిన్నె సమీపాన ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో రామయ్య తలకు బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో కడపకు తరలించినట్లు బంధువులు తెలిపారు.

మార్కెట్‌కు సంక్రాంతి కళ

– జోరుగా రంగుల పొడుల వ్యాపారం



మార్కెట్‌లో రంగు పొడి కొంటున్న మహిళలు

కడప కల్చరల్ : జిల్లాలో సంక్రాంతి సందడి మొదలైంది. ప్రత్యేకించి సంక్రాంతి పండుగకు ముగ్గుల పండుగగా పేరుంది. ధనుర్మాసం ప్రారంభమైనప్పటి నుంచి గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల ముందు కళ్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దడం ఆనవాయితీగా వస్తోంది. ముందులా భారీ స్థాయిలో కాకపోయినా సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కొందరు మహిళలు తెల్లవారుజామునే తమ ఇళ్ల ముందు మంచుముత్యాల్లాంటి తెల్లని ముగ్గుతో రంగవల్లులను తీరుస్తున్నారు. మరికొందరు ఓపిక చేసుకుని రంగులు కూడా వేస్తున్నారు. నెల రోజులుగా ఇళ్ల ముందు రంగుల ముగ్గులు కనువిందు చేస్తున్నాయి.

రంగులు సిద్ధం..

ప్రస్తుతం సంక్రాంతి పండుగ దగ్గర పడడంతో ముగ్గులు వేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఫలితంగా మార్కెట్లలో ముగ్గులో వేసేందుకు అవసరమైన రంగుపొడుల విక్రయాలు మొదలయ్యాయి. ముగ్గులు వేసే సీజన్ సంవత్సరంలో ఇదే గనుక మహిళలు తమ కళా ప్రతిభను ప్రదర్శించి రంగురంగుల ముగ్గులను తమ ఇంటి ముంగిళ్లలో తీర్చి ఇతరులను ఆకట్టుకునేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. ముగ్గుపొడి, రంగులను విక్రయించేందుకు కడప మార్కెట్‌లో దాదాపు 20కి పైగా దుకాణాలు వెలిశాయి. తెల్ల ముగ్గుపిండితోపాటు రంగులు కలిపిన ముగ్గుపిండికి కూడా డిమాండ్ ఏర్పడింది. అలాంటి ముగ్గుపిండి పావుకిలో రూ. 15 చొప్పున విక్రయిస్తున్నారు. కిలో రూ. 80లు ఆపైగా విక్రయిస్తుండగా, ముగ్గుపిండి కలిపిన రంగుపొడి కిలో రూ. 50కు విక్రయిస్తున్నారు. కేవలం తెల్లని ముగ్గుపిండి కిలో రూ.25 ఉండగా, ఏడు రంగుల పెద్ద చాక్‌పీస్‌లు రూ. 25–30లకు విక్రయిస్తున్నారు. రంగుపొడులుగల ఐదు చిన్న ప్యాకెట్ల కవర్ రూ.30లకు, 40 చిన్నప్యాకెట్లు గల కవర్ రూ. 70లకు విక్రయిస్తున్నారు. కళ్లాపి చల్లేందుకు వినియోగించే పేడ రంగు ప్యాకెట్ రూ. 10లకు అమ్ముతున్నారు. కడప నగరంలోని ప్రధానకూరగాయల మార్కెట్‌లో ప్రత్యేకించి రంగుపొడులు అమ్మే దుకాణాలు వెలిశాయి.

ఖర్చయినా.....ఇష్టంగా.....

ఓ మోస్తరు ముగ్గువేసి రంగులు నింపాలంటే కనీసం రూ. 50 నుంచి రూ. 100 రంగు పొడులు అవసరమవుతాయి. ముందే రంగులు కలిపిన ముగ్గుపిండిని ప్రత్యేకంగా అమ్ముతున్నారు గనుక మహిళలు రంగులు కొనాల్సిన అవసరం లేకుండా పోతోంది. చాక్‌పీస్‌లతో చిన్నసైజు గీతల ముగ్గు వేయాలంటే కనీసం రూ. 20 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక్కొక్క కట్టలో ఐదారు రకాల రంగుల చాక్‌పీసులు ఉంటాయి. ముగ్గులు వేయడం కంటే అందులో రంగులు నింపి తుది మెరుగులు దిద్దడానికే ఎక్కువ శ్రమపడాల్సి వస్తోంది. అయినా మహిళలు దీన్ని తమ ప్రెస్టేజీగా తీసుకుని ఇంటిలోని ఇతర మహిళలతో కలిసి తమ ఇళ్ల ముందు రంగులతో భారీ ముగ్గులను తీరుస్తున్నారు. పండుగ కేవలం మూడు రోజులే గనుక సాధన కోసం రెండు, మూడురోజులు ముందునుంచి ముగ్గులు వేయడం ప్రారంభించారు. భోగి రోజుతోపాటు సంక్రాంతి రోజు కూడా ప్రతి ఇంటి ముందు రంగుల ముగ్గు ఇంద్రధనస్సును తలపిస్తాయి.

ఎగరేద్దాం... గాలిపటం



కడప కల్చరల్: సంక్రాంతి సంబరాలు అనగానే గాలిపటాలు గుర్తుకు వస్తాయి. ఈ పండుగలో భాగంగా యువకులు, పిల్లలు ఉత్సాహంగా ఆరుబయట, మేడలపైన రంగురంగుల గాలిపటాలు ఎగురేస్తుంటారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో సంక్రాంతి సరంజామాలో భాగంగా పలు రకాల సైజులు, రంగుల్లో గాలి పటలను తెప్పించి సిద్ధంగా ఉంచారు. దాదాపు 50 రకాలకు పైగా ఆకర్శణీయమైన రంగులు, బొమ్మలతో గాలిపటాలను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. రూ. 5 నుంచి రూ. 150 ఖరీదు చేసే గాలిపటాలు నగరంలోని బీకేఎం వీధిలోని ఫ్యాన్సీ స్టోర్‌లలో లభిస్తున్నాయి. ఇటీవల సూపర్ హిట్ అయిన సినిమాలు, సినీనటులు, క్రికెటర్ల చిత్రాలుగల గాలిపటాలు ఆకర్శిస్తున్నాయి. శిల్పారామం లాంటి చోట్ల ఇటీవల గాలి పటాల పందేలు కూడా నిర్వహిస్తున్నారు.

సంస్కృతికి ప్రతిబింబాలు ముగ్గులు



బహుమతులు సాధించిన విజేతలతో ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: సంస్కృతికి ప్రతిబింబాలు రంగవల్లులని ఏకలవ్య ఫౌండేషన్ సలహాదారు గునిశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కడప నగరం తారకరామనగర్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంతో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ సలహాదారు గునిశెట్టి శ్రీనివాసులు, విద్యాకమిటీ సభ్యులు బాలాజీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్స్ జయదేవ్, నరేష్, సుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు పుట్టగొడుగుల పెంపకంపై వర్క్‌షాప్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో బయోటెక్నాలజీశాఖ ఆధ్వర్యంలో 'మిల్కీ మష్రూమ్ సాగు'పై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ విభాగాధిపతి ఆచార్య పి. చంద్రమతీశంకర్ తెలిపారు. వర్క్‌షాప్‌లో పుట్టగొడుగుల పెంపకం గురించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. వర్క్‌షాప్‌ను వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు.

నూతన నియామకం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం అకడమిక్ కంప్యూటేషనల్ డేటా సైన్స్ విభాగం కోఆర్డినేటర్‌గా ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్ ఆచార్య కె. కృష్ణారెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఆయనకు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, పాలకమండలి సభ్యురాలు డా. మాదక్క తదితరులు పాల్గొన్నారు.

రూట క్యాలెండర్ ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన రాష్ట్ర, జిల్లా, నగరశాఖ స్టిక్కర్స్, క్యాలెండర్‌లను సోమవారం కడపలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో కార్పోరేటర్ ఆరిపుల్లబాష, హరున్ బజాజ్ అధినేత ఎస్‌బి అహమ్మద్‌బాష, రూట డైరీ క్యాలెండర్ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరీ, క్యాలెండర్ కమిటీ కో చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్, రాష్ట్ర సమన్వయకర్త మొహమ్మద్ అయ్యూబ్, నగర అధ్యక్షులు అలి అక్బర్, కోశాధికారి దావూద్ తదితరులు పాల్గొన్నారు.

బాగా చదువుకోవాలి



విద్యార్థి ప్రసంగాన్ని వింటున్న ఎండీఎం ఏడీ దేవరాజు

కడప ఎడ్యుకేషన్: కడప నగరం చెమ్మియాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ఎండీఎం ఏడీ దేవరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతపై విద్యార్థులతో ఆరా తీశారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. బాగా చదవాలంటే మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, దీంతోపాటు వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మేరీ, పీడీ విజయలక్ష్మిలతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైవీయూలో ముందస్తు సంబరాలు



వైవీయూలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ఉట్టికొడుతున్న యువతి



కోలాట ప్రదర్శనలో విద్యార్థినులు



గాలిపటాలు ఎగురవేస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, తదితరులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో సంక్రాంతి ముందస్తు సంబరాలు ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని గురుకులం భవనాల్లో విద్యార్థులు రంగవల్లులతో అలరించారు. గొబ్బెమ్మలను ఏర్పాటు చేయడంతో పాటు ఉట్టికొట్టే పోటీలు, సంప్రదాయ కోలాటాలు, హరిదాసు కీర్తనలతో కన్నులపండువగా సాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డిలు హాజరై ప్రారంభించారు. భోగిమంటలు వెలిగించి, సంక్రాంతి లక్ష్మికి పూజలు నిర్వహించి పండుగను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగ ఎంతో ముఖ్యమైదన్నారు. అనంతరం సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం అధికారులు గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ఆచార్య విజయభారతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారుల సందడి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని సాయిబాబా, నాగార్జున మోడల్ స్కూల్, గురుకుల విద్యాపీఠ్ పాఠశాలల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సంప్రదాయ పద్ధతిలో నూతన వస్త్రాలతో వచ్చి సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. రంగవల్లులతో గొబ్బెమ్మలతో పాఠశాల ఆవరణాన్ని తీర్చిదిద్ది పండగ వాతావరణాన్ని తలపించారు.



నాగార్జున మోడల్ స్కూల్‌లో...



సాయిబాబా స్కూల్‌లో...



గురుకుల్ విద్యాపీఠ్‌లో....

పింఛన్ పెంపు చరిత్రాత్మకం



లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలోని పింఛన్ దారులకు పెన్షన్‌ను రూ.3వేలకు పెంచడం చరిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వీఆర్‌యస్ డిగ్రీకళాశాల మైదానంలో మండల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని ఏ రాష్ట్రంలో ఇంత పెద్ద మొత్తం పింఛన్ పంపిణీ చేయలేదని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ 3వేల రూపాయలకు పింఛన్ పెంచారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీ సభ్యులు సూచించిన వారికి మాత్రమే పింఛన్ మంజూరయ్యేదని అంతే కాకుండా ఏ రోజు పింఛన్ ఇస్తారోనని అవ్వలు, తాతలు ఎదురు చూసేవారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి నెలా 1వ తేది ఉదయాన్నే తలుపుతట్టి పింఛన్ ఇవ్వడం జరుగుతోందన్నారు. తెలుగుదేశం నాయకులు చెబుతున్న అబద్ధపు వాగ్దానాలు నమ్మి మోసపోవద్దని సూచించారు. నిత్యం రాష్ట్ర ప్రజల మంచి గురించి ముందు చూపుతో ఆలోచించే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేశారు. వీరపునాయునిపల్లె మండలంలో 5186మంది పింఛన్‌దారులకు నేటి నుంచి 3వేల రూపాయలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి భూమి పూజ



కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

మండలంలోని సంగమేశ్వరాలయ ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు శ్రీ వాణి ట్రస్టు ద్వారా 2కోట్ల రూపాయలతో నిర్మించబోతున్న కళ్యాణ మండపం నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ మండపం నిర్మించేందుకు ముందుకు వచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానం వారికి, కళ్యాణ మండపం మంజూరు కోసం ఆర్థిక సహకారం అందించిన షిర్డి సాయి ఎలక్ట్రికల్ అధినేత విశ్వేశ్వర్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. సంగమేశ్వర స్వామి దేవాలయం వద్ద శుభకార్యాలు నిర్వహించుకునే భక్తులకు కళ్యాణ మండపం ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీర ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, ఆలయ చైర్మెన్ శివాంజనేయరెడ్డి, ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ అర్చకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు పెన్షన్ కానుక పంపిణీ

వల్లూరు: వల్లూరులోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్లతో బాటు ప్రభుత్వం నూతనంగా రూ. 3 వేలకు పెంచిన పెన్షన్‌లను లబ్ధిదారులకు అందచేస్తారని తెలిపారు. మండలంలోని పెన్షన్ లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

రేపు రుద్రహోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం 6 గంటలకు రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఇన్‌చార్జి ఈఓ శంకర్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం శివ పార్వతుల కల్యాణం, అమావాస్య సందర్భంగా గురువారం సాయంత్రం 6 గంటలకు స్వామికి భస్మహారతి నిర్వహిస్తామని వారు వివరించారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని, స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు జగనన్న సురక్ష

వీరపునాయునిపల్లె: గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని గంగిరెడ్డిపల్లె, సంగాలపల్లె, మిట్టపల్లె గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కడప అర్బన్: కడప నగర శివార్లలోని రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో రామాంజనేయపురం వద్ద సోమవారం సాయంత్రం తన కుమార్తె, భార్యను మోటార్‌సైకిల్‌లో ఎక్కించుకుని వస్తుండగా, ఎదురుగా మోటార్ సైకిల్ వచ్చి ఢీకొనడంతో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈప్రమాదంతో ఆనంద్ (42) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎదురుగా ఢీకొన్న మోటార్ సైకిల్ వ్యక్తి , అలాగే ఆనంద్ భార్య, కుమార్తె గాయపడ్డారు.

పద్మావతి ఆశ్రమానికి వృద్ధురాలు



కడప అర్బన్: కడప నగరంలో శ్రీకృష్ణదేవరాయనగర్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వృద్ధురాలిని ఆటోలో తీసుకుని వచ్చి వదిలేసి వెళ్లారు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి కడప నగర శివార్లలోని పద్మావతి వృద్ధాశ్రమానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆ వృద్ధురాలిని తమ ఆశ్రమానికి తీసుకుని వెళ్లారు.

వంతెన ప్రారంభం

వీరపునాయునిపల్లె: మండలంలోని యస్ పాలగిరి సచివాలయ పరిధిలోని ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామం వద్ద 57లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన వంతెనను సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేలికపాటి వాన కురిచిన వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు పడేవారని ప్రస్తుతం వంతెన ఏర్పాటు చేయడంతో ఓబుల్‌రెడ్డి గ్రామస్థుల కష్టాలు నేటితో తొలగిపోయయాయన్నారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచులు విజయ్‌కుమార్ యాదవ్, సురేంద్ర కుమార్ యాదవ్, ఎంపీటీసీ భీముడు, మాజీ ఎంపీపీలు వీరయ్యయాదవ్, గోవిందురెడ్డి పాల్గొన్నారు.

కూచిపూడిని ప్రత్యేక శ్రద్ధతో నేర్చుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ నటి, నర్తకీమణి మంజు భార్గవి

ప్రొద్దుటూరు : కూచిపూడి నృత్యాన్ని ప్రత్యేక శ్రద్ధతో నేర్చుకోవాలని ప్రముఖ సీనియర్ నటి, నర్తకీమణి మంజు భార్గవి తెలిపారు. సోమవారం స్థానిక వైఎంఆర్ కాలనీలో నృత్యతరంగణి కళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువులు ఇచ్చే మెలకువలు నేర్చుకుంటూ కూచిపూడి నృత్యంలో ఉన్నత స్థానాల్లో రాణించాలన్నారు. నాట్య నిలయంలోనే కాకుండా ఇంటి వద్ద కూడా విద్యార్థులు సాధన చేస్తే ఉత్తమ ఫలితం దక్కుతుందన్నారు. విద్యార్థులను నాట్య నిలయంలో చేర్చిన ఏడాదిలోనే వేదికలపై నృత్య చేయించాలని తల్లిదండ్రులు ఆరాట పడుతున్నారని, దీనివల్ల అనుకున్నంతగా రాణించలేక పోతున్నారన్నారు. పూర్తి స్థాయిలో నాట్యం నేర్చుకుని వేదికలపై ప్రదర్శనలు ఇవ్వాలని సూచించారు. కృష్ణా జిల్లా కూచిపూడి కళాపీఠం ప్రిన్సిపాల్ రామలింగశాస్త్రి, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత వసంత కిరణ్ మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగిన కూచిపూడి నృత్య శిక్షణకు హాజరైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నృత్యతరంగణి కళా నిలయం నిర్వాహకుడు శ్రావణ్ కుమార్, నాట్య గురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.